పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశానికి పోలిసెట్- 2023లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన సోమవారం నుంచి తమ కళాశాలలో ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ విలియం కేరి తెలిపారు. మొదటి రోజు సోమవారం 20మంది తమ పత్రాలను పరిశీలించనున్నారని తెలిపారు. ర్యాంకుల వారీగా జూన్5 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతున్నాయని ప్రిన్సిపల్ తెలిపారు.

అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

అర్జీలు సత్వర పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

"జగనన్నకు చెబుదాం" కార్యక్రమములో వచ్చే అర్జీదారుల వినతులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో "జగనన్నకు చెబుదాం" కార్యక్రమంలో జెసితో పాటు డిఆర్‌ఒ జె. వెంకటరావు ప్రజల నుండి వినతులు స్వీకరించారు. జగన్న కు చెబుదాం కార్యక్రమంలో 200 వినతులు రాగా వీటిలో అధిక శాతం భూ సమస్యలు, పెన్షన్ అర్జీలు అందాయి. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కనీస వసతుల్లేక అవస్తలు

ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ఎంతోమంది ప్రజలు తమ సమస్యలను విన్నవించుకొనేందుకు వస్తుంటారు. ప్రజా సమస్యలను తెలియజేసేందుకు దరఖాస్తు చేసుకునేందుకు స్పందన ప్రాంగణంలో కనీస వసతులు లేవు. దరఖాస్తులు నింపుకునేందుకు బెంచీలు లేక పార్కింగ్ ప్రదేశంలోని వాహనాలపై దరఖాస్తులను రాసుకుంటున్నారు. కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేక మహిళలు, వృద్ధులు మెట్లపై కూర్చొని సేద తీరుతున్నారు. వేసవిలో మండుటెండలో కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ప్రజానీకానికి గొంతెండుతున్నా గుక్కెడు మంచినీళ్లు దొరికే అవకాశం కూడా లేదు. కొంతమంది తమ పిల్లల్ని తీసుకొని కలెక్టర్ కార్యాలయానికి వచ్చి క్యూ లైన్‌లో నిలబడిగా తమవెంట చిన్నారులకు కనీసం కూర్చోడానికి స్థలం లేక ప్రాంగణంలోనే నిలబడి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. అధికారులు స్పందించి స్పందన కార్యాలయానికి వచ్చి ప్రజల కోసం కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

మెట్లు మీద కూర్చొని సేదతీరుతున్న మహిళలు

బైకులపైనే దరఖాస్తులు రాస్తున్న అర్జీదారులు

జిల్లా అభివృద్ధికి బ్యాంకులు సహకరించాలి

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విత్త సేవల సంచాలకులు కార్తికేయ మిశ్రా

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లా అభివృద్ధికి బ్యాంకులు సహకరించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విత్త సేవల సంచాలకులు కార్తికేయ మిశ్రా అన్నారు. జిల్లా పర్యటనకు సోమవారం విచ్చేసిన ఆయన స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా కొత్తగా ఏర్పడడం, షెడ్యూల్ ప్రాంతంలో ఉండడం బ్యాంకుల సహకారం ఎంతో ఉందన్నారు. స్టాండ్ ఆఫ్ ఇండియా, ముద్రా యోజన, పిఎం స్వనిధి తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అందుకు సంబంధిత మార్గదర్శకాలు క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. జిల్లాలో అర్హత కలిగిన లబ్ధిదారులు అనేక మంది ఉంటారని వారికి ప్రయోజనం కల్పించవచ్చునన్నారు. బ్యాంకులు మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాంకు శాఖలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కెవిఐసి, కెవిఐబి కార్యకలాపాలు విస్తృతం చేయాలని, సంబంధిత అధికారులతో సమీక్షించి లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్‌కు సూచించారు. పిఎం జీవన్ జ్యోతి బీమా (పిఎం జెజెబి), పిఎం సురక్షా బీమా యోజన (పిఎంఎస్‌బివై), అటల్ పింఛను యోజన కింద అనేక మంది ప్రయోజనం పొందగలరని అన్నారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకు శాఖల ఏర్పాటుకు ప్రదేశాలను గుర్తించి ప్రతిపాదించామని అన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్‌ఎన్ మూర్తి జిల్లాలో బ్యాంకుల ప్రగతిని వివరించారు. జిల్లాలో 103 బ్యాంకు శాఖలు, 89 ఎటిఎం లు ఉన్నాయని చెప్పారు. ముద్రా యోజన క్రింద రూ.104.46 కోట్లను 15,383 మందికి పంపిణి చేయడం జరిగిందని తెలిపారు. పి.ఎం స్వనిధి కింద 2,075 దరఖాస్తులు అందగా 1994 దరఖాస్తులకు మంజూరు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

త్వరలో కేంద్ర ఆర్థిక మంత్రి రాక

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ జూన్‌లో పార్వతీపురం పర్యటించే అవకాశం ఉందని కార్తికేయ మిశ్రా అన్నారు. ఈ పర్యటన ఖరారైతే సమాచారం అందిస్తామని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలో బ్యాంకులు మంచి ప్రగతిని చూపి కేంద్ర ఆర్థిక శాఖా మంత్రికి స్వాగతం పలకాలని సూచించారు. **ప్రజల ఆర్థిక భద్రతే లక్ష్యం**

గరుగుబిల్లి : అనంతరం మండలంలోని తోటపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ బ్యాంకు ఖాతాదారులతో నిర్వహించిన ముఖాముఖి కార్తికేయ మాట్లాడారు. బ్యాంక్ అధికారులు ఖాతాదారులతో మమేకమై సేవలు అందిస్తున్నారా, లేక ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ, భీమా పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద తక్కువ ప్రీమియం చెల్లించి బీమా వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైనందున ఖాతాదారుల సౌలభ్యం దృష్టిలో పెట్టుకొని మరిన్ని ఎటిఎం సేవలు విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఆర్థిక అక్షరాస్యత పెరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనం కల్పించేలా బ్యాంక్ అధికారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పారదర్శక పద్ధతిలో అందజేస్తున్నామన్నారు. ప్రజలు పథకాల ప్రయోజనం పొందేందుకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం బీమా చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.బి.ఐ డెప్యూటీ జనరల్ మేనేజర్లు ఎ.వెంకట్రామయ్య, పంకజ్ కుమార్, ఎస్ఎల్‌బిసి ఎజిఎం ఇ.రాజబాబు, నాబార్డు ఎజీఎం టి.నాగార్జున, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్.మూర్తి, జట్టు వ్యవస్థాపకులు డా.పారి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాదారుతో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విత్త సేవల సంచాలకులు కార్తికేయ మిశ్రా

కలెక్టర్ నిశాంత్‌కు సన్మానం

ప్రజాశక్తి - కలెక్టరేట్

సీతానగరం మండలం జోగింపేట పంచాయతీకి జాతీయ స్వచ్ఛ పురస్కారం, జాతి స్థాయిలో నీతి అయోగ్ వివిధ రంగాల అభివృద్ధికి సాధించేందుకు ఆశావాహ జిల్లాలో జిల్లా ఉత్తమ స్థానం దక్కించుకున్న సంగతి అందరికీ విదితమే. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను తన ఛాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారుల సంఘం, జిల్లా అధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. సమష్టి కృషితో అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి బాటలో కొనసాగించాలని కోరారు.

కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

విద్యాశాఖాధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి

డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన గ్రామాల్లో గల డ్రాపౌట్స్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. సోమవారం ఐటిడిఎ పరిధిలోగల అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, హెడబ్ల్యువోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ డ్రాపౌట్స్ డేటా పక్కాగా తయారు చేసుకోవాలని సూచించారు. బడికి రాకుండా బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించాలని సూచించారు. జెవికె కిట్లు అందరికీ పంపిణీ చేయాలని సూచించారు. అలాగే పాఠ్య పుస్తకాల పంపిణీలో ఎటువంటి అలసత్యం ఉండకూడదని అన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. పాఠశాలలో వైద్య పరీక్షలు తరుచుగా నిర్వహిస్తుండాలన్నారు. అందుకు గానూ సచివాలయ ఎఎన్‌ఎంలు పాఠశాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసేలా రెండు జిల్లాల డిఎంహెచ్‌ఒలకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. పాఠశాలల పునః ప్రారంభమయ్యే నాటికి అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సూచించారు. విద్యుత్, తాగునీరు సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. వసతి గృహాల్లో మెనూ సక్రమంగా పాటించాలన్నారు. ఏకలవ్య పాఠశాలల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. బాలికల పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మించేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. అన్ని పాఠశాలల్లో 100శాం అడ్మిషన్లు పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో డీడీ సూర్యనారాయణ, ఒఎస్‌డి (ఎడ్యుకేషన్) ఎం.యుగంధర్, జిసిసి డిఎం జి.సంధ్యారాణి, డిఇఇ కృష్ణ, ఎటిడబ్ల్యుఒలు శ్రీనివాసరావు, మంగవేణి, సూపరిండెంట్ దేశ్, హెచ్‌ఎంలు, హెచ్ డబ్ల్యువోలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రూపుల పోరు కొలిక్కివచ్చేనా... విభేదాలు సద్దుమణిగేనా?

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ముందు నేడు నగర పంచాయతీ కౌన్సిలర్ల పంచాయతీ

ప్రజాశక్తి-పాలకొండ, పాలకొండ రూరల్

కొద్దిరోజుల నుంచి పాలకొండ నగరపంచాయితీలో కౌన్సిలర్ల మధ్య ఆధిపత్య పోరు ఎక్కువైంది. నగర పంచాయతీలో ఇరవై వార్డులకు గానూ 17 వార్డుల్లో అధికార వైసిపి గెలుపొందినప్పటికీ వారి మధ్య ఉన్న అంతర్గత విభేదాలతో పార్టీ ప్రతిష్టను రోడ్డు మీదకి తీసుకొస్తున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ అధికార పార్టీ కౌన్సిలర్లు రెండు గ్రూపులుగా విడిపోయారు. గత కొంతకాలంగా కౌన్సిలర్ల మధ్య విభేదాలు మరింతగా పెరిగి వర్గపోరుకు ఆద్యం పోస్తున్నారు. నగరపంచాయితీలో ఆధిపత్యం కోసం కౌన్సిలర్లు కొంతకాలం నుండి హడావిడి చేస్తూ తారాస్థాయిలో విభేదాలు సృష్టించుకుంటూ రోడ్డు ఎక్కుతున్నారు. కౌన్సిలర్ల మధ్య సఖ్యత లేకపోవడంతో ప్రతీ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై పోరాటం చేయండా, ఆధిపత్య పోరు కోసం రోడ్డు ఎక్కుతున్నారు. రెండు వర్గాలుగా మారి ఆరోపణలు, ప్రత్యారోపణలతో కౌన్సిల్ సమావేశం పక్కదారి పట్టిస్తున్నారు. ఎమ్మెల్యే మద్దతు తమకు ఉందంటూ ఒక వర్గం, ఎమ్మెల్సీ మద్దతు తమకు ఉందని ఇంకొక వర్గం విభేదాలకు ఆజ్యం పోస్తున్నారు. వీళ్ల వర్గపోరుతో పార్టీ పరువు రోడ్డు మీదకి తీసుకుని వస్తున్నారు. దీంతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కూడా ఈ వర్గపోరుతో ఇరకాటం పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పాలకొండ పట్టణం అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రజలు తమలో తాము ప్రశ్నించుకుంటున్నారు. అయితే ఈ వ్యవహారం రచ్చకు ఎక్కడంతో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ ఇద్దరు కూడా ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో స్థానిక కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఈ సమావేశంతో వర్గపోరు పక్కనపెట్టి కౌన్సిలర్లు ఐక్యంగా ఉంటారో లేదో చూడవలసి ఉంది.

పిడుగుపాటుకు ఆవు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేటకు చెందిన పి.రాము అనే రైతుకు చెందిన ఆవు పిడుగుపాటుకు గురై మృతి చెంది. వివరాలకు వెళ్తే రాము ఆవులు మేపు కోసం పొలాలకి తోలుకు వెళ్లాడు. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా పిడుగులు వర్షం రావడంతో పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. సుమారు రూ.60వేలు విలువ చేసే ఆవు మృతి చెందడంతో రైతు రాము రోధిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని రాము అధికారులను కోరుతున్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు

కళాసీ ఛార్జీలు రైతులకే చెల్లించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2021-22 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సుమారు 80శాతం కళాసీ ఛార్జీలు రైతులే చెల్లించారని, కానీ బినామీ రవాణా ఏజెన్సీలు బినామీ కళాసీల పేర్లు నమోదు చేసి అక్రమాలతో, నిధులు పక్కదారి పట్టించినందున దర్యాప్తు చేసి రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం జాయింట్ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2021-22 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ఏజెన్సీలు పిఎసిఎస్ తదితరు కేంద్రాల ద్వారా ఆర్‌బికెల్లో రైతుల ధాన్యం కొనుగోలుకు నమోదు చేసి మిల్లులకు తరలించే వాహనాలు జిల్లాలో ఎక్కువ భాగం రైతులు వాహన ఛార్జీలు పెట్టుకొని తరలించారని అన్నారు. రైతులు రవాణా చేసిన వాహనాలు తాలూకా పేపర్లు, యజమానులు బ్యాంక్ అకౌంట్ ఆర్‌బికెలో నమోదు చేసి ప్రభుత్వం ఇచ్చే రవాణా నిధులు దుర్వినియోగం చేశారని, ఈ విధంగా అంటిపేట, ఆర్.వెంకమ్మపేట, చినబోగిలి, నారాయణపురం తదితర ప్రాంతాల్లో జరిగిందన్నారు. జిల్లాలో 80శాతం రైతు ధాన్యం రవాణా చేసిన కళాసీ ఛార్జీ కూడా రైతులే పెట్టుకున్నారని, వాటికి ప్రభుత్వం ఇచ్చిన నిధులు జిల్లాలో అనేక పిఎసిఎస్ తదితర కొనుగోలు ఏజెన్సీలు బినామీ కళాసీ పేర్లు పెట్టి నిధులు కాజేసి దుర్వినియోగం చేశారని అన్నారు. వాస్తవంగా రైతులు ఖర్చు పెట్టినా వారికి ఇవ్వలేదనీ, అందువల్ల జిల్లాలో కొనుగోలు ఏజెన్సీలు చేసిన కోట్లాది రూపాయలు అక్రమాలు దర్యాపు చేయించి రైతులకు న్యాయంగా రావల్సిన రవాణా, కళాసీ డబ్బులు ఇప్పించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం అధ్యక్షులు రమణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఈశ్వరరావు, గ్రామ రైతు సంఘం నాయకులు పైల విశ్వనాథం, సిఐటియు జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు, శ్రీరాములు, సింహాచలం, మంత్రబుడ్డి బలరాం, సత్యనారాయణ తదితర రైతులు పాల్గొన్నారు.

రాజధానిలో పేదలకు చోటివ్వకూడదా?

చంద్రబాబు వ్యాఖ్యలపై డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-సాలూరు

రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తే ఓర్వలేకనే ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు దురహంకార వ్యాఖ్యలు చేశారని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. సోమవారం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలకు నిరసనగా నియోజకవర్గ పరిధిలోని మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. తన నివాసం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగింది. బోసుబొమ్మ జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు సమాధుల నిర్మాణానికి పనికొస్తాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమరావతిని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం నిర్మించాలని చంద్రబాబు కలలు కన్నారని చెప్పారు. పేదలకు మేలు చేస్తుంటే ఓర్వలేకనే చంద్రబాబు నాయుడు తప్పుడు వ్యాఖ్యలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో అర్బన్‌బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, జగనన్న సచివాలయాల కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ పప్పల లక్ష్మణరావు, పాచిపెంట మండల నాయకులు పి.చినబాబు, జి.ముత్యాల నాయుడు, మక్కువ మండలం నాయకులు మావుడి రంగునాయుడు, సాలూరు మండలం సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ భరత్ శ్రీనివాస్, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, అర్బన్‌బ్యాంక్ డైరెక్టర్ పువ్వుల భరత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బలిజిపేట: చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలకు నిరసనగా బలిజిపేట మండల కేంద్రం నుంచి బర్లి రకు నిరసన భారీ బైక్ ర్యాలీ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే జోగారావు సారథ్యంలో నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు టిడిపి దుర్మార్గపు సర్వేలను నిరసిస్తూ చంద్రబాబు వైఖరి మారాలని, పేదల ఇళ్ల స్థలాలను స్మశానంతో పోల్చడాన్ని ఆయన దురహంకారానికి పేద బడుగు బలహీన వర్గాల పై ఉన్న చిన్న చూపుకు నిదర్శనం అని నిలదీస్తూ, డౌన్ డౌన్ చంద్రబాబు అని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సుమారుగా 10 కిలోమీటర్ల మేర చేపట్టిన ర్యాలీ కార్యక్రమం బర్లి గ్రామం మీదగా పనదాన రహదారి వద్దకు చేరుకొని అక్కడ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యేమాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 31 లక్షల 50 వేల మందికి ఇళ్ల స్థలాలను ఇవ్వడం జరిగిందని పేదలకు 1400 ఎకరాల్లో పేదలకు ఇళ్ల పట్టాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. దీంతె తమ ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వచ్చేస్తుందోనన్న భయంతో పేదల ఇళ్ల స్థలాలపై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించారని అన్నారు. ఇది ఎంత మాత్రం సభ్య సమాజంలో తగదని, చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ఈ భారీ ర్యాలీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో బలిజిపేట, సీతానగరం మరియు పార్వతిపురం మండలాల ప్రజా ప్రతినిధులు జడ్పిటిసిలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మండలాల పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, పిఎస్సిఎస్ చైర్మన్లు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బైకు ర్యాలీలో అభివాదం చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

జూన్ 2నుంచి జరగబోయే పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 1693 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయాల్సి ఉందని, వీరి కోసం 9 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశామని అన్నారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, చీఫ్ సూపరింటెండెంట్లు 13 మంది, పరీక్షా కేంద్రాలను పరిశీలించడానికి 13 మంది జిల్లా అధికారులను నియమించినట్లు తెలిపారు. రూట్ అధికారులుగా నలుగుర్ని నియమించామన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసులను ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను కోరారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద శానిటేషన్ చేసి, బ్లీచింగ్‌ను చల్లాలని పురపాలక శాఖ అధికారులను ఆదేశించారు. మంచి నీటిని ఏర్పాటు చేసి, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు జేసీ సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను కోరారు. పరీక్షలు జరిగే కేంద్రాల రూట్లలో అదనంగా బస్సులను నియమించాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఎటువంటి పొరబాటులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అధికారులు బి.జగన్నాధరావు, స్వామినాయుడు, కె.శివరామ్, టివిఎస్ సుధాకర్, ఎం.గజపతిరావు, ఎం.రమణమ్మ, రాజేంద్ర ప్రసాద్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త మేనిఫెస్టోపై ప్రచారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కొత్త మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం చేసి, ప్రజల్లో చర్చ జరిగేలా కార్యక్రమాలు నిర్వహించాలని టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశించారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. ఆయన స్వగ్రామమైన కృష్ణపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల సందర్భంగా టిడిపి విడుదల చేయనున్న మేనిఫెస్టోలో కొన్ని పథకాలను తమ నాయకుడు ప్రకటించగానే అధికార పక్షంలో ప్రకంపనలు మొదలయ్యాయని అన్నారు. మహానాడు ముగిసిన తర్వాత చంద్రబాబునాయుడును కలవగా, నియోజకవర్గ పార్టీ పరిస్థితిపై ఆరా తీశారని అన్నారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

రేషన్ కోసం 8 కిలోమీటర్లు నడవాల్సిందేనా?

ప్రజాశక్తి - కురుపాం

రేషన్ బియ్యం కావాలంటే గిరిజనులు 8 కిలోమీటర్లు నడవాల్సిందే అని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వానికి ప్రశ్నించారు. గిరిజన సంఘం జిల్లా మహాసభల ప్రచారం కోసం మండలంలో నీలకంఠాపురం పంచాయితీ నాయుడుగూడకు సోమవారం ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి సమస్యను గిరిజనులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నాయుడుగూడలో గిరిజనులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాయుడుగూడ నుండి ధర్మలక్ష్మీపురం మీదుగా 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న నీలకంఠపురం గ్రామానికి రేషన్ బియ్యం కోసం కాలి నడకన వెళ్తున్నారని, రానూపోనూ 16 కిలోమీటర్లు దూరం నడిచి గిరిజనులు బియ్యం తెచ్చుకుంటున్నారని తెలిపారు. వెళ్లిన రోజు వేలి ముద్రలు పడక పోతే రెండేసి, మూడేసి రోజులు తిరగాల్సి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. గతంలో జుంబిరిలో రేషన్ డిపో ఉండేదని దాన్ని నీలకంఠపురానికి మార్చినప్పటి నుంచి ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జుంబిరిలో డిపోను ఉంచాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందించినప్పటికీ మార్పు చేయలేదని అన్నారు. కూలి పనులను విడిచిపెట్టి రేషన్ కోసం రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జుంబిరిలో డిపో అయిన ఏర్పాటు చేయాలని, లేకుంటే ఆఫ్‌లైన్లోనైనా రేషన్ బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు బిడ్డిక వెంకటరావు, నాగేశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు.



పట్టణంలో విద్యుత్ కాంతుల మధ్య అమ్మవారి చిత్రం

విద్యుత్ కాంతులతో ధగ ధగ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం గ్రామ దేవతైన శ్రీ ఇప్పల పోలమ్మ అమ్మవారి పండగ సందర్భంగా ఉత్సవ నిర్వాహక సభ్యులు పట్టణాన్ని విద్యుత్ కాంతులతో సుందరంగా తీర్చిదిద్దారు. పండగను తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు ఈ అలంకరణను చూసి పెద్దఎత్తున తరలివస్తున్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా పండగ జరుగుతుండడంతో ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది భక్తులు వచ్చేందుకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. మంగళవారం జరిగే సిరిమాను ఉత్సవానికి సిరిమానును సిద్ధం చేస్తున్నారు. సోమవారం నాడు రాత్రి 7 గంటలకు అమ్మ తల్లి గుడి దగ్గర తోలేళ్ళ ఉత్సవం జరిగింది. అమ్మవారికి పూజించే ధాన్యాన్ని రైతులకు తమ పొలాలలో వేసే విత్తనాలతో కలుపుకునే నిమిత్తం అందజేశారు..

ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం గ్రామ దేవతలైన ఇప్పల పోలమ్మ, యర్రకంచమ్మ అమ్మవారులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సిరిమాను ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పరంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా అమ్మవార్లు ఆశీర్వదించి పట్టణ ప్రజానీకానందర్నీ చల్లగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పాచిపెంట ఎస్‌సి కాలనీలో గల అంబేద్కర్ సామాజిక భవనాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట కెవిపిఎస్ ఆధ్వర్యాన స్థానికులు ధర్నా చేశారు. ఈసందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ కాలనీలో 30 ఏళ్లగా ఉన్న సామాజిక భవనాన్ని ఎవరూ లేనిసమయంలో స్థానిక ఆంధ్ర స్కూల్ హెచ్ఎం మాథ్యూస్, స్థానిక ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పార్వతి కలిసి అమానుషంగా కూల్చివేశారని అన్నారు. ఆధునీకరణ చేయాలని భావిస్తున్నతరుణంలో కూల్చివేయడం తగదని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను అనధికారంగా కూల్చివేసే సంబంధించిన అంబేద్కర్ సామాజిక భవనాన్ని కూల్చివేసి అందరి మనోభావాలు దెబ్బతీసి, భవనాన్ని నిధులు లేకుండా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ భవనాన్ని కూల్చివేసిన ప్రదేశంలోనే అంబేద్కర్ కొత్త భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లాకార్యదర్శి యమ్మల మన్మధరావు మద్దతు తెలిపారు.

సంతకాలను సేకరిస్తున్న ఫెడరేషన్ నాయకులు

మున్సిపల్ కార్మికుల సంతకాల సేకరణ

ప్రజాశక్తి - సాలూరు

దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఫెడరేషన్ నాయకులు టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర గవర్నర్‌కు పంపనున్నారు. సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పని చేస్తున్న 40వేల మంది మున్సిపల్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. గత ఎన్నికల ముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను విస్మరించారని చెప్పారు. శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులతో ప్రభుత్వం పని చేయిస్తుందని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా పెరిగిన కారణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని శంకరరావు డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ సంఘ నాయకులతో మాట్లాడుతన్న డిడి సూర్యనారాయణ

టీచర్ల బదిలీలపై డిడి సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజన సంక్షేమ టీచర్ల బదిలీలపై వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో గిరిజన సంక్షేమశాఖ డిడి సూర్యనారాయణ సోమవారం తన కార్యాలయంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని సంఘ నేతలు డిడిని కోరారు. ముఖ్యంగా బాలికల పాఠశాలల్లో మహిళా టీచర్లను మాత్రమే నియమించడం, స్పౌజ్, ప్రిఫరెన్షియల్ కేటగిరి అభ్యర్థులకు నిబంధనల ప్రకారం పాఠశాలలను కోరుకునే అవకాశం కల్పించడం, టీచర్ల ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్ని ఖాళీలు ప్రదర్శించడం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకష్ణారావు, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాగాన విజయ్, ఎపి ఎస్‌సి, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సింహాచలం, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు చక్రపాణి, ఎపిటిఎఫ్ మహిళా నేత ప్రమీల, కార్యాలయ సూపరింటెండెంట్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల (గ్రీన్ అంబాసిడర్లు) పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించి ఆదుకోవాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు 10నెలల పెండింగ్ జీతాలు విడుదల చేసి అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 31 పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 10 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అసలే అరకొరవేతనాలు, అందులో నెలల తరబడి ఇవ్వకపోతే వారు కుటుంబాలను పోషించుకోవాలని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించి అన్ని విధాలా పారిశుధ్య కార్మికులను ఆదుకోవాలని కోరారు .కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు స్వామి నాయుడు, దాశరధి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక

ఎంపిడిఒ కార్యాలయాల వద్ద గ్రీన్ అంబాసిడర్ల నిరసన

ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు నిరసన తెలిపారు. గ్రీన్ అంబాసిడర్ల సంఘ నాయకులు గణపోతు రామారావు, కుంద లక్ష్మణ, యజ్జల చిన్న, రామస్వామి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ తమ ఆరోగ్యాల సైతం లెక్కచేయకుండా పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడర్లకు 10నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే యూనిఫాంలు, శానిటైజర్లు, చెత్త ఎత్తే సామగ్రితో పాటు వేతన బకాయిలు తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు కె.రాము నిమ్మకాయల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : పారిశుధ్య కార్మికులకు బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియూ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ మండలంలోని పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు 12 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించే బాధ్యతను పంచాయతీలకు అప్పగించే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. అనంతరం వినతి పత్రాన్ని స్థానిక ఎంపిడిఒ జి.పైడితల్లి అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు అప్పారావు, శ్రీనివాసరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ : ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

స్పందనకు 50 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో నిర్వహించిన స్పందనకు 50 వినుతులు వచ్చాయి. పిఒ కల్పనాకుమారి బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో పులిపుట్టి చెందిన కరువయ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మోటారు మంజూరు చేయాలని విన్నవించారు. నౌగూడ చెందిన సుజాత జీవనోపాధుల కోసం రుణం మంజూరు చేయాలని కోరారు. పెద్ద వంగరలో విద్యుత్ స్తంభాలు వీధిలైట్లు వేయాలని ఆరిక మహేష్ కోరారు. కుంటిభద్రకు చెందిన గోవిందరావు ఎస్‌బిఐ నిర్మాణం బిల్లులు చెల్లించాలని కోరారు. ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ జి.మురళి, జిసిసి డిఎం సంధ్యారాణి, మేనేజర్ నరసింహులు, సిడిపిఒ రంగలక్ష్మి, ఎడి ఇ.తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందనిఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గాయత్రి స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా అమ్మఒడి పథకాన్ని వర్తింప చేస్తుందని, ప్రతి ఒక్కరూ చక్కగా చదివి బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని విద్యార్థులను సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్లు ఎస్.లోకేష్, ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, వ్యవసాయ మండల సలహా కమిటీ చైర్మన్ కె.లీలాప్రసాద్ రావు, టి.అన్నాజీ, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశకిత - వీరఘట్టం

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి విఎఎలకు హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విఎఎలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మీ నిర్లక్ష్యం వల్ల ఈ ఏడాది రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో విఫలమయ్యామని, మరోసారి అటువంటి తప్పు చేయకుండా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు రైతులకు చేరువయ్యేలా చూడాలన్నారు. త్వరలో విత్తనాల పంపిణీలో ఎటువంటి లోపాల్లేకుండా చూడాలన్నారు. ప్రతి విషయాన్ని గ్రామ స్థాయిలో సర్పంచులు, ఎంపిటిసిల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అలాగే జూన్ ఒకటో తేదీన పాలకొండ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించనున్న రైతు భరోసా నాలుగో విడత కార్యక్రమానికి మీ పరిధిలోని ఉన్న రైతులందర్నీ అధిక సంఖ్యలో తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ పి.విక్రాంత్ మాట్లాడుతూ ఎవరు నిర్లక్ష్యం వహించినా వారికి మెమో ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్యక్రమాలకు సర్పంచులకు సమాచారం చేయాలన్నారు. ముఖ్యంగా సర్పంచుల నుండి ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతు భరోసా కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు వచ్చేలా చూడాలన్నారు. మండల వ్యవసాయ అధికారి కె.మన్మధరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, ఎంపిడిఒ వై.వెంకటరమణ, వ్యవసాయ మండల సలహా కమిటీ చైర్మన్ కె.లీలా ప్రసాద్, విఎఎలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న టిడిపి నాయకులు

ఎర్ర కంచెమ్మ గుడికి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని జగన్నాథపురంలో గల ఎర్ర కంచెమ్మ పండగ నిమిత్తం బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్మన్ బేబీ నాయనా సోమవారం రూ.50వేలు విరాళం స్థానిక టిడిపి నాయకులు మజ్జి కృష్ణమోహన్ ద్వారా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. వీటితో పాటు మజ్జి బ్రదర్స్ తరపున రూ.20వేలు కృష్ణమోహన్ ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు..

నవధాన్యాల సాగు... నేలతల్లికి బాగు

ప్రజాశక్తి - బలిజిపేట

నవధాన్యాల సాగు నేలతల్లికి మంచిదని జిల్లా రీజనల్ టెక్నికల్ లీడ్ అండ్ పిఎండిఎస్ కె.ప్రకాష్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని మిర్తివలసలో ప్రకృతి వ్యవసాయం విస్తరణలో భాగంగా పిఎండిఎస్ నవధాన్యాల సాగు చేసే విధానం, ఈ సాగు వల్ల జీవ వైవిధ్యం పెరుగుతోందని, నేలలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, మొక్కలకు కావాల్సిన పోషకాల లభ్యత పెరుగుతున్నదని, పశువులకు పచ్చి మేత అందుతుందని, కలుపు ఉండదని, ప్రధాన పంటలో అధిక, నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. పై లాభాలు గ్రామాల్లో రైతులకు విస్తృత అవగాహనతో పాటు పిఎండిఎస్ హెూల్ గ్రామాల మార్పులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతేడాది ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించిన రైతులు జి.సత్యారావు, జి.ఆదినారాయణ, జి.పద్మావతి, గుడుపూరు గంగయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఎఒ శ్రావణకుమార్ రైతులు క్షేత్ర స్థాయి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని ఆర్.వెంకంపేటలో ప్రకృతి వ్యవసాయం విస్తరణలో భాగంగా పిఎండిఎస్ నవధాన్యాల సాగు రైతులకు జిల్లా రీజనల్ టెక్నికల్ లీడ్ అండ్ పిఎండిఎస్ కె.ప్రకాష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపిఎం షన్ముఖరాజు, మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ సర్పంచ్ రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించిన రైతులను సన్మానిస్తున్న అధికారులు

జంఝావతి ప్రాజెక్టు సాధనకు ఉద్యమం

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జంఝావతి ప్రాజెక్టు సాధనకు ఉద్యమమే శరణ్యమని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యాన జంఝావతి ఆయకట్టు రైతుల సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ జంఝావతి ప్రాజెక్టు పనులు ప్రారంభించి సుమారు ఐదు దశాబ్దాలు కావస్తోందన్నారు. రూ.13.5 కోట్ల రూపాయల అంచనాతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు రూ.120 కోట్లు వెచ్చించినా ఇంకా పూర్తి ఆయకట్టుకు సాగునీరు కల్పించే స్థితి లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఆయకట్టు పరిధిలో గల రైతులంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో ఉద్యమించి పాలకులపై ఒత్తిడి తేవడం ద్వారానే పరిష్కారం అవుతుందని అన్నారు. క్షేత్రస్థాయి నుంచి పోరాట కమిటీలు వేసి రాజకీయాలకు అతీతంగా అందర్నీ కలుపుకొని కార్యాచరణ చేపడితే ప్రాజెక్టును సాధించగలమని అన్నారు. ఉత్తరాంధ్ర సజల స్రవంతి (పోలవరం ఎడమ కాలువ)పై పాలకులు చూపుతున్న నిర్లక్ష్యంపై జూన్ 6న విశాఖపట్నంలో జరుగు సదస్సులో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు.

ఎసిఎం స్ప్రేయింగ్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా నివారణలో భాగంగా నిర్వహిస్తున్న ఎసిఎం స్ప్రేయింగ్‌ను అంతా ఇంటి వద్దే చేయించుకోవాలని మండలంలోని రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ పి.శ్రావణ్ కుమార్, చీకటి శంకరరావు అన్నారు. సోమవారం రావాడ రామభద్రపురంలో జరిగిన స్ప్రేయింగ్ కార్యక్రమంలో పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో స్ప్రేయింగ్‌ను చేయించుకోవాలని కోరారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కూడా స్ప్రేయింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్ నారాయణరావు, ఎంపిహెచ్ఇఒ సూర్యనారాయణ, సూపర్వైజర్ రాధాకృష్ణ, ఎంటిఎస్ ఆదినారాయణ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జెవికె స్టాక్ పరిశీలన

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గల జగనన్న విద్యా కానుక కిట్లను వైకెసి ఎపిఎం జి.సింహాచలం పరిశీలించారు. సోమవారం ఆయన పాఠశాలలో నిల్వ వున్న జగనన్న విద్యా కానుక కిట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సరిపడా స్టాక్ వచ్చిందా లేదా అని వివరాలు ఆరా తీశారు. వచ్చే నెలలో ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం బట్టలు, చెప్పులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. దీని కోసం పాఠశాలలకు అందుబాటులో వుండేలా మొత్తం స్టాక్‌ను ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిల్వ చేశారు.

త్వరలో రెండో విడత భూరీసర్వే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పార్వతీపురం డివిజన్‌లో రెండో విడత భూరీసర్వే త్వరలో చేపట్టనున్నట్టు సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.సూర్యారావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం డివిజనల్‌లో 109 గ్రామాలను రీసర్వే నిమిత్తం ఎంపిక చేశామన్నారు. అందులో గరుగుబిల్లి మండలంలోని 14 గ్రామాలకు రీసర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటికే 3 గ్రామాల్లో సర్వే పూర్తి చేశామన్నారు. డివిజన్‌లో 48 గ్రామాలు పూర్తిగా సర్వే చేయగా, 44 44 గ్రామాల్లో క్షేత్రస్థాయి పనులు జరిగాయన్నారు. డివిజన్‌లో రీసర్వే జులై 15 నాటికి పూర్తి చేయవచ్చన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున సిబ్బంది ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, అలాగే సాయంత్రం 3 గంటల నుండి సూర్యాస్తమయం వరకు ఫీల్డ్ వర్క్ చేస్తున్నారన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఫీల్డ్‌వర్క్‌కు సంబంధించి ఎలాంటి సాంకేతిక పరికరాలు, సిబ్బంది కొరత లేవని అన్నారు. సమావేశంలో మండల సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏగోటివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం సచివాలయం పరిధి ఏగోటివలసలో పెదంకలాం పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.రమాకాంత్ ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రోగులను తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ గోపాలరావు, ఎఎన్ఎం బి.రమాదేవి, ఎంఎల్‌హెచ్‌ఒ కె.హరిప్రియ, ఆశా కార్యకర్త రమాదేవి పాల్గొన్నారు.

అచ్చిపువలసలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని అచ్చిపువలస గిరిజన గ్రామంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జి.ప్రదీప్ కుమార్ జ్వర పీడితులు, గర్భిణీలు, బాలింతలు, మధుమేహ,రక్త పోటు తదితరమైన వారికి తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశాలున్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎం రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి, టెక్నీషియన్, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతానగరం : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఒడిశా కుట్రను పసికట్టకపోతే నష్టం

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల వ్యవహారంలో ఒడిశా పన్నాగాన్ని పసికట్టకపోతే ఎపికి అపారనష్టం కలుగుతుందని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీసెట్టి బాబ్జీ చెప్పారు. సోమవారం ఆయన నేరళ్లవలస, దొరలతాడివలస, మూలతాడివలస, కుంబిమడ, పణుకులోవ, దూళిభద్ర, దిగువ శెంబి గ్రామాల్లో పర్యటించి స్థానిక గిరిజనులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కొటియా గ్రామాల విషయంలో ఎపి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల అపార ఖనిజ సంపద కోల్పోయే అవకాశం ఉందని చెప్పారు. ఒడిశా పోస్టల్ డివిజన్ కేంద్రప్రభుత్వంతో మాట్లాడి కొటియాకు ప్రత్యేక కోడ్ తెప్పించుకున్నారని చెప్పారు. దీన్ని సుప్రీంకోర్టులో ఆధారంగా చూపించి తనకు అనుకూలంగా తీర్పు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల కొటియా గిరిజనులు సంతృప్తిగా ఉన్నారని, ఆంధ్రా వైపే వుండడానికి ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి గిరిజనులకు తగిన భరోసా లభించడం లేదని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాలని, ఒడిశా కుట్రలను పసిగట్టి కొటియా గ్రామాలపై హక్కు సాధించాలని భీసెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు.

భూములకు పాస్ పుస్తకాలు ఇప్పించండి

ప్రజాశక్తి - కలెక్టరేట్

తమ భూములకు ఆన్లైన్ చేయించి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని మలగ పంచాయతీ లక్ష్మన్నదొరవలస, బండలుప్పి పంచాయతీ చొక్కపువానివలస గ్రామ గిరిజన రైతులు సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.రాము మాట్లాడు తూ 1991 సంవత్సరం ల్యాండ్ సీలింగ్ జరిగిన నుంచి రైతులంతా సర్వేనెంబర్ 27/3,5, 6,7లో 106 ఎకరాల భూమి సాగు చేస్తున్నారని అన్నారు. కానీ వీరి భూములను ఆన్లైన్ చేయడం లేదని, ఇదివరకే తహశీల్దార్‌ను కలిస్తే ఈ భూముల కేసు సిబిసిఐడి వద్ద ఉందని చెబుతూ నేటికీ పాస్ పుస్తకాలు ఇవ్వలేదని తెలిపారు. ఇదే విషయమై ఆర్‌డిఒకు సమస్య తెలపగా, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, మద్దతు తెలిపారు.

నృత్యాలతో అలరించిన విద్యార్థులు

పజాశక్తి -పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 22వ రోజు పిల్లలు అందరూ ఆటలు, డాన్స్ లు చేసి ఆనందించారు. ఎక్కువ మంది పిల్లలు పాల్గొన్నారు. మంగళవారం కళా అంకురం ఫ్యాషన్ డిజైనర్ డైరెక్టర్ అల్లు ప్రియాంక పిల్లలకు ఇంట్లో ఉన్న వస్తువులు సూది, దారం, రబ్బరు బ్యాండ్‌తో కొన్ని వస్తువులు, కలర్ కాంబినేషన్ వంటివి వివరిస్తారని, కావున అందరూ ఆహ్వానితులేనని గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు కార్యక్రమంలో డ్రాయింగ్ మాష్టర్ జి.మురళీకృష్ణ, గ్రంథాలయసంఘం సహాయకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

తినుకు గ్రామానికి మంచినీరు, రహదారి తదితర మౌలిక సదుపాయం కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సిపిఎం, గిరిజన, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కుంతేసు పంచాయతీలో గల తినుకు గ్రామానికి మంచినీరు, రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వినతిని అందజేశారు. అనంతరం కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ తినుకులో సుమారు 22 కుటుంబాలకు చెందిన గిరిజన జీవిస్తున్నారని, ఈ గ్రామానికి నేటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు. అలాగే ఈ గ్రామంలో మంచినీరు కూడా లేకపోవడంతో పొలాల్లోని బురద నీరు తాగే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాన్ని సందర్శించి మంచినీరు, రహదారి సౌకర్యం కల్పించి ఈ గిరిజన గ్రామాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన, రైతు సంఘాల నాయకులు రాము, లక్ష్మ, ఉపేంద్ర పాల్గొన్నారు.

సాగునీటి వనరులపై దృష్టి సారించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సాగునీటి నిల్వ వనరులైన చెరువులు, గెడ్డలు, చెక్ డ్యామ్‌లు, రిజర్వాయర్లు తదితర వాటిపై దృష్టి సారించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి పార్వతిపురం మన్యం జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు అన్నారు. సోమవారం ఆ సమితి మండల అధ్యక్షులు బలగ శంకర్రావు, పట్టణ అధ్యక్షులు శిగడం భాస్కరరావుతో కలిసి జగన్ అన్నకు చెపుదాం కార్యక్రమంలో భాగంగా డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్ కుమార్‌ను కలిసి వినతిని అందజేశారు. మాట్లాడారు. త్వరలో రానున్న రుతుపవనాల దృష్ట్యా ఎక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, కావున ముందుగానే జిల్లాలోని చెరువులన్నింటికీ కానాలు, మదుములు, చప్టాలు, షట్టర్లను పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టి, అవసరం ఉన్న చోట కొత్తవి ఏర్పాటు చేసే చర్యలు చేపట్టాలన్నారు.